

# ఆదివారం మే 18

## అంకే శ్రీనివాస్

"రేయ్ రాజా! ఏడున్నర అయ్యింది. ఏంటీ మొద్దు నిద్ర" అని నన్ను గట్టిగా కుదిపి వెంకటరాముడు నిద్రలేపితే కప్పుకున్న జంకాళం తీసి గట్టిగా కళ్ళు నులుముకొని వాణ్ణి చూశాను.

నోట్లో బ్రష్షు, పెదాలమీదా నురగ. అపుడప్పుడే నిద్రలేచాడనడానికి గుర్తుగా నిద్రమత్తు పూర్తిగా వదలని కళ్లు.

నిద్రలేవగానే ఎవరైనా దేవుడి పటం చూస్తారు. నాకు మాత్రం ప్రతిరోజూ మా వెంకటరాముని ముఖమే దర్శనమయ్యేది.

అలా కొద్దిసేపు కూర్చొని లేచి అద్దంలో చూసుకున్నాను. నిద్ర తక్కువై ఎర్రబడిన కళ్ళలో పిసురు, ఉబ్బిన బుగ్గలు, చెదిరిన క్రాపు నేను అద్దంలో చూసుకుంటుంటే-

"నువ్వా పెద్ద గ్లామరు బాయివిగాని ముందు నోట్లో బ్రష్‌పడనీరా" అని వాడు అన్నాడు.

అరగంటలో నా పనులు ముగించాను.

ఇద్దరం రాత్రి మిగిలిన చద్దన్నంతో టిఫిన్ ముగించి హాస్టలు బయటకు వస్తుంటే వాడు అన్నాడు.

"మెస్సు ఉంటే కనిపించదుగాని, ఇదో పెద్ద నరకంరా! ఇంకా నెలరోజులు ఎట్లా వుండాలో" ఇంతకు ముందు తిన్న వేరుశనగ విత్తనాల కారంపొడి ప్రభావం అని అర్థం చేసుకున్నా! వేసవి సెలవులు అయినందువల్ల యూనివర్సిటీ హాస్టలు మెస్సులు మూసివేశారు. అందువల్ల స్వయంపాకం తప్పదు. టిఫిన్‌కు బదులుగా రాత్రి చద్దన్నం, వేరుశనగ విత్తనాల కారంపొడి మధ్యాహ్నం రాత్రి భోజన సమయాల్లో యూనివర్సిటీ పక్కనున్న పల్లెనుంచి కొంత మంది పప్పూ రసం మా హాస్టళ్ళ దగ్గరకు తీసుకు వస్తారు. ఉంటే డబ్బులు పెట్టి లేదంటే అప్పుగా మూడు, నాలుగు రూపాయల పప్పుగాని, రసంగాని తీసుకుంటాం.

"ఎప్పుడురా ఎగ్జాము" అడిగాడువాడు.

"ఆదివారం 18వ తేది, ఇంక మూడు రోజులే ఉంది"

"ఎగ్జాము హైదరాబాదులోనే కదా?"

"అవును"

"మరి ఛార్జీల కోసం ఆలోచించావా?"

"పొలిటికల్ సైన్సు డిపార్టుమెంటులో కళ్లులేని అబ్బాయికి స్క్రైబరుగా మొన్న సెకండు సెమిస్టరు ఎగ్జామ్సు రాశాను కదా! వాటి డబ్బులు దాదాపు మూడు వందలా యాభైవరకూ రావచ్చు. అయినా వాటినే నమ్ముకోకుండా చంద్రాగాడు ఊరికి పోతుంటే విషయం చెప్పి మూడు వందలు అప్పు అడిగాను. వాడు నిన్ననే రావల్సింది. ఈ రోజుగాని రేపుగాని రావచ్చు".

"అందుకే! నేను కూడా మనోహరుగాణ్ణి ఇందు కోసమే అడిగి వుంచాను. ఈ రోజుగాని రేపుగాని మనియార్డరు వస్తుంది ఇస్తానన్నాడు. ఒరే రాజా! నువ్వు ఎలాగైనా ఈసారి సివిల్సు కొట్టాలిరా" చివరి మాట వాడు ఒత్తిపలకడం తెలుస్తూనే వుంది.

నా మీద ఎందుకోగాని వాడికి ప్రేమ చాలా ఎక్కువ. ఇటువంటి మంచి ఫ్రెండు ఉండటం నా అదృష్టం. ఎం.ఎ లో మాత్రమే నా క్లాసుమేటు కావడం దురదృష్టం. ఏమైనా వాడు నా మీద చూపించే అభిమానాన్ని ఒకటిరెండు మాటల్లో చెప్పడం కష్టం.

నేను ఈ ఆలోచనలలో ఉన్నట్టుగానే పినాకిని హాస్టలు పక్కనున్న టీబంకు దగ్గరికి వచ్చేశాము. మా ముఖం చూడగానే టీ బంకు నరసింహులు వన్ బైటు 'టీ' ఇచ్చాడు. టీ చప్పరిస్తూ అక్కడున్న దినపత్రికలో తలదూర్చాము.

***

"పదైదు రోజులయ్యింది సెకండు సెమిస్టరు రాసి! ఇంకా ఎప్పుడిస్తారండి" క్లర్కు నాగభూషణాన్ని గట్టిగా అడిగాను.

"ఏం చేయాలి తమ్ముడు ఎడి బిల్డింగులో (యూనివర్సిటీ భవనం) కన్సల్టెంటు క్లర్కు లీవులో ఉన్నాడు. లేకపోతే నిన్ను ఇలా ప్రతిరోజూ తిప్పుకోవాల్సిన అవసరం ఏముంటుంది".

"టేపురికార్డులాగా రోజూ చెప్పే మాటే ఇది. ప్రతిరోజూ ఇలా తిప్పుకోవడం మీకు బాగా అలవాటయ్యింది". నెమ్మదిగా అన్నా స్పష్టంగా అన్నాడు వెంకటరాముడు.

"నేనేమి చేయను తమ్ముడు, అక్కడ క్లర్కు ఉంటే ఐదు నిమిషాల పని. ఎంతసేపు".

"ఇంతకీ ఆ క్లర్కు గారు ఎప్పుడొస్తారో" మా వాడు వెటకారంగా అన్నాడు.

"నాకు ఎలా తెలుస్తుంది తమ్ముడు? రేపు ఖచ్చితంగా వస్తాడని అతని కొలీగ్స్ ఇందాక బస్సులో చెప్పారు.

అంతలోనే పొలిటికల్ సైన్సు హెడ్డు సూర్యసాగర్ గారు, టీచింగ్ అసిస్టెంటు సుందరేశం రూంలోకి వచ్చారు.

సుందరేశం మమ్మల్ని గమనించి నాగభూషణంతో "మా పాలిట నువ్వు బాగా దొరికావు భూషణం. మమ్మల్ని రోజూ సతాయిస్తుంటావు. వీళ్ళను కూడా మా మాదిరిగానేనా! రావల్సినదెంతో తొందరగా ఇప్పించవచ్చు కదా!"

ఆ మాటలు విన్న సూర్యసాగర్ గారు "ఏమివ్వాలి నాగభూషణం" అని అడిగాడు.

నాగభూషణం నన్ను చూపిస్తూ "అదేసార్! సెకండు సెమిస్టరులో కళ్ళులేని అబ్బాయికి స్క్రైబరుగా ఈ అబ్బాయి ఎగ్జాము రాశాడు కదా! ఆ డబ్బులు ఇవ్వాలి"!

"ఏంటీ! ఇంకా ఇవ్వలేదా! పరీక్షలు అయిపోయి కూడా పదైదురోజులు కావస్తోంది."

"క్లర్కు ప్రభాకరు లీవులో ఉన్నాడు. అందువల్ల రేపు రమ్మంటున్నాను సార్".

"తొందరగా చూడు. విలేజ్ స్టూడెంట్లలాగా ఉన్నారు. కరువు పరిస్థితి, రోజూ పేపర్లో చూస్తే భయమేస్తోంది".

సార్ చాలా బాగా అర్థం చేసుకున్నారనిపించింది. అందువల్ల "సార్ నేను రేపు రాత్రి తొమ్మిదిన్నరకు హైదరాబాదు వెళ్ళాలి. ఎల్లుండి సర్వీసుకమీషను ప్రిలిమ్స్ ఎగ్జాము వుంది సార్"

"అవునా! ఆల్ ది బెస్ట్!" అని చెప్పి వెళ్ళారు.

రేపు మళ్లీ వస్తామని నాగభూషణంతో చెప్పి బయటికి వచ్చినా ఎందుకో నా మనసు కీడును శంకిస్తోంది. నా అనుమానాన్ని నిజం చేస్తూ సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో మా వెంకటరాముడు బాంబులాంటి వార్త మోసుకొచ్చాడు.

"అకౌంటు సెక్షనులో క్లర్కు ప్రభాకరు ఈరోజు ఆఫీసుకు వచ్చాడని, అసలు ఈ పదిరోజుల్లో ఒక్కరోజు కూడా సెలవు పెట్టలేదని, అంతేగాక పొలిటికల్ సైన్సు డిపార్టుమెంటులో క్లర్కు నాగభూషణం పెద్ద సోమరిపోతని, అవినీతిపరుడని" చాలా చెప్పాడు మా వాడు.

"సారీరా! ఊరి నుంచి రావడానికి చార్జీల కోసమే నాన్న చాలా ఇబ్బంది పడ్డాడు. ఈ భయంకరమైన కరువులతో అక్కడి పరిస్థితి చెప్పేది కాదు. చార్జీ డబ్బులున్నా గాని మొన్ననే వచ్చి వుండేవాడిని. అసలు ఆ మాట కొస్తే రాకుండా వుండేవాడిని.

నాగభూషణం మీద కోపంతో మనసంతా మొద్దుబారిపోయింది. "రేపు ఈ విషయం హెడ్డుకి, ప్రిన్సిపాల్‌కి చెప్పాలి" అని నేను అంటుంటే –

"రేయో! అంతకన్నా ముందు రేపు డబ్బులు వస్తాయో లేదో అది ఆలోచించు. ఎందుకైనా మంచిది ఇప్పుడే ఎవర్నయినా అప్పు అడుగుదాం. ఆ తర్వాత కంప్లైంటు ఇస్తువు గాని, నేనూ ప్రయత్నిస్తాను" అని వాడు బయటికి పోవటంతో నేను కూడా ఎవర్నైనా అడగటం కోసం ఫ్రెండ్సు రూముల వైపు వెళ్ళాను.

***

కట్టలు తెంచుకున్న మా ఆవేశానికి క్లర్కు నాగభూషణం సారీ చెప్పి గంటలో పని పూర్తిచేసి 'చెక్కు' రెడీ చేశాడు.

అప్పుడు మరో సమస్య ఎదురయ్యింది. చెక్కు మీద హెడ్‌ఆఫ్‌ది డిపార్టుమెంటు సంతకం వుండాలి. కాని సూర్యసాగర్ సారు ఇంతవరకూ రాలేదు. సెలవూ పెట్టలేదు. పదిగంటలకే రావాల్సింది. పన్నెండు గంటలయ్యింది అయినా రాలేదు. నా మనస్సులో టెన్షను ఎక్కువవుతోంది. ఇంటికి ఫోను చేశాము. వస్తాడని చెప్పడంతో కొంత ఉపశమనం. సెలవులు అయినందున యూనివర్సిటీ ప్రొఫెసర్లు తక్కువగా వస్తూ వుంటారు.

అర్థగంటకు సారు వచ్చి సంతకం చేయడంతో వెలిగిపోతున్న మా ముఖాల్ని చూసి సారు నవ్వటం నేను గమనించాను.

చెక్కు తీసుకొని దగ్గర్లో ఉన్న బ్యాంకుకి బయలుదేరాము.

"హమ్మయ్య ఎంత టెన్షను ఫీలయ్యానోరా! ఒక దశలో కొడతావేమోనని అనుకున్నా! పర్లేదు నీక్కూడా కోపమొస్తుంది" వెంకటరాముడు అన్నాడు.

"లేకపోతే ఏంటిరా, ఎప్పుడో రావల్సిన డబ్బులు. అబద్దాలాడాడని నిన్న సాయంత్రం నువ్వు చెప్పినప్పటి నుంచి చాలా కోపంగా వుంది. టీచింగు అసిస్టెంటు సుందరేశం సారుకూడా బాగా తిట్టాడు. అలా ముగ్గురం అడగబట్టే చెక్కు రాయించుకొచ్చాడు.

మేము మాటల్లో ఉన్నట్టుగానే బ్యాంకు వచ్చేసింది.

కాని...

బ్యాంకు మూసేసి వుంది.

"ఏంటిరా బ్యాంకు మూసి వుంది"

"అదే నాకూ అర్థం కావట్లేదు... ఆ.... ఈరోజు శనివారం కదా! బ్యాంకు పన్నెండు గంటల దాకానే పని చేసేది...ఛ..."

మా యిద్దరి మధ్యా నిస్సహాయతతో కూడిన నిశ్శబ్దం.

"అయినా... ఈ కాంపిటీషను ఎగ్జాములేంటో, ఆదివారం రోజునే జరిపి చస్తారు. ప్రతిపరీక్షా అంతే".

నేనేమి మాట్లాడాలో తెలియట్లేదు.

తిరిగి నిరాశగా హాస్టలుకి వచ్చాము. రూములో చంద్ర ఊరి నుండి వచ్చి వున్నాడు. వాడు కనిపించగానే సంతోషం. మా విషయం చెప్తే –

"సారీరా! ఊరినుంచి రావడానికి చార్జీల కోసమే నాన్న చాలా ఇబ్బంది పడ్డాడు. ఈ భయంకరమైన కరువులతో అక్కడి పరిస్థితి చెప్పేది కాదు. చార్జీ డబ్బులున్నా గాని మొన్ననే వచ్చి వుండేవాడిని. అసలు ఆ మాటకొస్తే రాకుండా వుండేవాడిని. పదహైదు రోజుల్లో బి.ఈడి ఎగ్జాము వుందికదా! రాక తప్పిందికాదు. ఇప్పుడు మాత్రం చార్జీ డబ్బులు కోసం నాన్నను చాలా ఇబ్బంది పెట్టాను". చంద్ర వాళ్ళింటి పరిస్థితులు చెప్పడంతో మా ఇంటి పరిస్థితులు కళ్ళముందు ఒక్కసారిగా గిర్రున తిరిగాయి.

యూనివర్సిటీలో ఇంతకుముందు అడిగిన

వాళ్ళను, అడగని వాళ్లను, అడగవలసిన వాళ్లను, అడగకూడని వాళ్ళను ముగ్గురు అడిగేశాం. మహానంది, గంగా, క్రిష్ణా, పినాకిని, ఇలా హాస్టళ్లన్నీ తిరిగినా మూడు వందలు కాదుకదా! ముప్పై రూపాయలు కూడా లభించలేదు. చివరికి అమ్మాయిల హాస్టలైన గోదావరి, యమున, కావేరిల్లో వున్న తెలిసిన అమ్మాయిల్ని అడిగినా అదే పరిస్థితి.

కరువు ఇక్కడి జీవితాల్ని కరకర నమిలేస్తుంటే మహామహా భూస్వాములే కర్పూరంలాగా కాలిపోయారు. కాలిపోతున్నారు. ఇక మా లాంటి పేదవాళ్ల సంగతి చెప్పాల్సిన అవసరమే లేదు.

సెలవుల్లో సాధారణంగా యూనివర్సిటీలో వుండేది పేదవిద్యార్థులే. బి. ఈడి, బి.ఎస్సీ వంటివి ప్రిఫేరవుతూ వుంటారు. బయోటెక్నాలజీలు, బయోకెమిస్ట్రీలు, మైక్రోబయాలజీలు చదవటం నాలాంటి వాళ్ళకు కల్లో కూడా సాధ్యం కాదు.



కరువు ఇక్కడి జీవితాల్ని కరకర నమిలేస్తుంటే మహామహా భూస్వాములే కర్పూరంలాగా కాలిపోయారు. కాలిపోతున్నారు. ఇక మా లాంటి పేదవాళ్ల సంగతి చెప్పాల్సిన అవసరమే లేదు. సెలవుల్లో సాధారణంగా యూనివర్సిటీలో వుండేది పేదవిద్యార్థులే. బి. ఈడి, బి.ఎస్సీ వంటివి ప్రిఫేరవుతూ వుంటారు.

భారంగా ఉన్న నన్ను చూసి చంద్రా అన్నాడు "ఒరే రాజా! నీకు మన ఆంధ్రా హిస్టరీ సారు బాగా పరిచయం కదా! అదేరా ప్రసాదు సారు. ఒక్కసారి ప్రయత్నించకూడదా?"

"ఇంతకుముందు నేను తీసుకున్నవే ఇవ్వలేదు. మళ్ళీ అడగడం బాగుండదు".

"అవునా... మరి రాఘవేంద్ర సార్ని"

"ఆయన్ను కూడా వద్దురా! బయటికి కనిపించేటంత మంచి వాడు కాదు" వద్దన్నాడు వెంకటరాముడు.

"నేను అనంతపురం వెళ్తాను. అక్కడ బంధువులున్నారు. చివరిసారిగా ప్రయత్నిస్తానని" చెప్పి గబగబా స్నానం చేసి 'హాల్ టికెట్' జేబులో పెట్టుకొని, ఒక జత బట్టలు కవరులో పెట్టుకొన్నాను. అక్కడ సరిపోతే అట్లే రైలు ఎక్కేద్దామని.

వెంకటరాముడు కూడా బయలుదేరాడు తను కూడా ప్రయత్నిస్తానని.

చంద్రాతో తన చార్జీలు పోగా మిగిలివున్న ఇరవై అయిదు రూపాయిలు తీసుకొని బస్సెక్కాము.

అరగంట తర్వాత బస్సు అనంతపురం బస్టాండులో మమ్మల్ని వదిలివేసింది. టైము అయిదున్నర కావస్తోంది.

"అదృష్టయినా కాకపోయినా రాత్రి తొమ్మిదిన్నర లోపున రైల్వేస్టేషను దగ్గరకు వచ్చేయాలని" చెప్పుకొని చెరోవైపు కదిలాము.

ఇప్పుడు నేను అడగాలనుకున్న వాళ్ళు దగ్గరి బంధువులు. మా పిన్నమ్మా వాళ్ళు. అంటే మా అమ్మ పెదనాన్న కూతురు. ఆమె భర్త కలెక్టరు ఆఫీసులో జూనియరు అసిస్టెంటు. అతన్ని "మంచి చేతివాటం" గల వ్యక్తిగా మా బంధువులు చెప్పుకుంటుంటారు.

ఏవిషయంలోనూ సహాయపడే వ్యక్తులు కాదని అమ్మ అప్పుడప్పుడు చెప్పే విషయం కూడా జ్ఞాపకం లేకుండా పోలేదు. అయినా చిన్ని ఆశ. ఎందుకంటే ఏవైనా శుభకార్యాలు జరిగినప్పుడు వీళ్ళు కలిస్తే నా చదువు గురించి ప్రత్యేకంగా అడిగే వాళ్లు. అప్పుడు "ఏదైనా అవసరం అయితే అడగమని తప్పకుండా సహాయ పడతానని" చిన్నాయన చెప్పడం జరుగుతూండేది.

ఏమైనా అడగడం ఒక పెద్ద సమస్య. స్నేహితులను ఏమైనా ఎలాగైనా అడగవచ్చు. కానీ, బంధువుల్ని ఎలా అడగాలా అని ఎంత ఆలోచించినా తోచింది కాదు.

ఇలా ఆలోచనల్లో వుండగానే బైపాసు దాటేశానన్న సంగతి గమనించాను. ఇంతదూరం ఈ ఆలోచనల్లోనే నడిచొచ్చానా అని అనిపించింది. టౌను కాబట్టి తెలీదు గాని బస్టాండు నుండి బైపాసు నాలుగైదు కిలోమీటర్లుంటుంది. బైపాసు దాటిన పది నిమిషాల్లో పిన్నమ్మవాళ్ళు ఇల్లు వచ్చేసింది.

సమయానికి భార్యాభర్తలిద్దరూ ఉన్నారు. పిల్లలు ఇంటి బయట ఆడుకుంటున్నారు. నన్ను చూడగానే లోపలికి ఆహ్వానించి ఆసక్తిగా ఇంటి విషయాలు, నా చదువు విషయాలు అడిగారు.

పది నిమిషాల్లో పిన్ని నా చేతికి కాఫీగ్లాసు ఇచ్చింది.

కాఫీ తాగుతూ వాళ్ళ ప్రశ్నలకు సమాధానాలు చెప్తూ "ఎలా అడగాలా" అని ఆలోచిస్తున్నాను.

కరువు పరిస్థితులు గురించి అక్కడి సమస్యల గురించి అడిగి బాధపడ్డారు. ఇన్ని ఇబ్బందుల్లోనూ నేను చదవటం చాలా గొప్ప విషయమని ఇద్దరూ అభినందించారు.

చివరకు తెగించి నేనొచ్చిన విషయం చెప్పాను. మా పిన్ని వెంటనే అందుకొంది. "ఇంటిఖర్చులు, ఇంటిబాడుగ, కరెంటు, పిల్లల కాన్వెంటు ఫీజులు, ట్యూషను ఫీజులు..." చాలా ఏకరువు పెట్టి "... మీ చిన్నాయనకు వచ్చే ఐదువేల రూపాయలు ఎందుకూ సరిపోదు రాజా! చెప్పుకోవడానికి మాత్రం ఉద్యోగం. ఏమీ అనుకోవద్దు రాజా! మా పరిస్థితి కూడా చాలా ఇబ్బందిగా వుంది" ముఖానే చెప్పేసింది.

ఆమె మాటలకు ఏమి సమాధానం చెప్పాలో తెలీలేదు నాకు. పది నిముషాలు మొహమాటానికి ఇతర విషయాలు మాట్లాడి ఇంటి నుండి బయటకొచ్చాను. ఆ ఇంటి పరిస్థితి చూస్తే ఆమె చెప్పిన ఇబ్బందులేవీ వున్నట్లుగా నాకు అనిపించలేదు.

అడిగి తప్పు చేశాననిపించింది. ఇక రాణీనగర్ వెళ్ళాలి. అనంతపురం ఈవైపు నుండి ఆ వైపుకు దాదాపుగా ఆరు కిలోమీటర్లు ఉంటుందేమో రాణీ నగరు.

వేగంగా నడక ప్రారంభించాను. ఇప్పుడు వెళ్ళబోయే వాళ్ళది మా ఊరే. పల్లె పరిస్థితుల నుండి బయటపడాలని సంవత్సరం క్రితం అనంతపురం వచ్చారు. ఏడున్నరా ఎనిమిది అవుతుండగా రాణీ నగర్ చేరుకున్నాను. బయటనుండి పిలిస్తే ఎవరని బయటకు తొంగి చూసింది లక్ష్మీదేవి.

లక్ష్మీదేవి పదవ తరగతి దాకా నా క్లాసుమేటు. కుటుంబ పరిస్థితుల ప్రభావం వల్ల చదువు అక్కడే ఆగిపోయింది.

అలాగే చూస్తున్న నన్ను చూసి "ఏంటి రాజశేఖరా అట్లా నిలబడివుండావు రా లోపలికి..." ఆప్యాయంగా పిలిచింది లక్ష్మీదేవి.

ఇంట్లో వాళ్ళమ్మను చూసి "ఏమత్తా! బాగున్నారా!!" అడిగాను.

ముఖమంతా అభిమానాన్ని నింపుకొని "బాగుండామప్పా! నువ్వెట్లుంటివి. ఊరికి ఈమధ్యనేమన్నా పోయింటివా! నాన్న, అన్నయ్య, తమ్ముడు, చెల్లెలు బాగుండారా" అభిమానాన్ని కురిపిస్తోంది.

తమ కుటుంబం గురించి చెప్పుకొచ్చింది. భర్త మార్కెట్టులో కూలీ అని తమ పరిస్థితుల్ని కన్నీళ్ళతో వివరించింది.

లక్ష్మీదేవి బయటకు వెళ్ళి టీ తెచ్చిచ్చింది.

తల్లీబిడ్డలిద్దరూ ఊరి గురించి చాలా అడుగుతున్నారు. యథాలాపంగా సమాధానం చెప్తూనే ఆ ఇంటిని గమనించి వాళ్ళకు నేనొచ్చిన విషయం చెప్పడం ఇష్టంలేకపోయింది. ఎందుకంటే దారిద్ర్యాన్ని పల్లె నుండి పట్టణానికి వలసగా తెచ్చుకున్నారు వాళ్ళు. పోయొస్తానని చెప్పి బయటికి వచ్చాను.

ఒక్క విషయం నాకు స్పష్టమైంది – 'ఈ రోజు నేను హైదరాబాదుకు వెళ్ళలేనని. రేపు పరీక్ష రాయలేనని'. అయినా ఆశ చావక కమలానగరు, గుల్జారుపేట, శ్రీనివాసనగరులలో ఉంటున్న స్నేహితులు ముగ్గురి ఇళ్ళకు వెళ్లాను. ఇద్దరు సమయానికి ఇంట్లో లేరు. ఒకడు ఉన్నా సమయానికి డబ్బులు లేవన్నాడు.

నిరాశగా రైల్వేస్టేషనులోకి అడుగుపెడుతుంటే ఎదురుగా వెంకటరాముడు నా కోసమే ఎదురు చూస్తున్నాడు, అదృష్టవలేదని చెప్పాను. ఊహించినట్టుగా వాడూ అదేమాట చెప్పాడు.

ఏదో రైలువచ్చి గట్టిగా కూతలేస్తూ స్టేషనులో ఆగింది. రైల్వేస్టేషను ప్రాంగణం ప్రయాణికులతో నిండిపోయింది.

మా ఇద్దరి మధ్య గాఢమైన నిశ్శబ్దం. బరువెక్కిన గుండెలు. ఆశలు ఆశయాలు పేకమేడల్లె కూలిపోతుంటే జీవచ్ఛవాలస్థితి.

ఐదు నిమిషాల తర్వాత ఆగిన రైలు కూతవేస్తూ వెళ్ళింది.

జీవితం మీదా చదువు మీదా నిరాశ.

పేదరికం జీవితాల్ని అతలాకుతలం చేస్తుంటే నాలాంటి వెధవ ఐ.ఎ.ఎస్ ఆఫీసరు అవ్వాలనుకోవడం పెద్ద అత్యాశ.

ఇంట్లో పరిస్థితులు చూడలేక ఆ పరిస్థితులకు దూరంగా పల్లెకి వెళ్ళడమే తగ్గించిన పిరికివాడు విజయుడు కావాలనుకోవడం మూర్ఖత్వం.

నా ఆలోచనలన్నీ ఛేదిస్తూ వెంకటరాముడ న్నాడు.

''దొంగరైలుకి వెళ్తే''

కోటి దీపాల వెలుగులాంటి ఆశ.

''నిజమే వెళ్తానురా''

వాడు గబగబా ఎంక్వరీ దగ్గరకు వెళ్లి ముఖం వేలాడేసుకొని వచ్చి ''ఇప్పుడు వెళ్ళినది కాచిగూడా ఎక్స్‌ప్రెస్సే''

వెలిగి చప్పున ఆరిపోయిన ఆశ.

నెమ్మదిగా బస్టాండు వైపు నడక ప్రారంభించాం, యూనివర్సిటీకి తిరిగి వెళ్దామని.

మా ఇద్దరి మధ్య మౌనం.

చివరి బస్సు కొద్దిసేపటిక్రితమే వెళ్ళిందని తెలి యడంతో లారీలో వెళ్దామని సంగమేష్ థియేటరు వద్దకు నడుస్తున్నాం.

నాకు ఏమీ మాట్లాడాలనిపించలేదు. వాడు కూడా మౌనంగానే నడుస్తున్నాడు. మా మౌనాన్ని పలకరిస్తూ అప్పుడప్పుడు వాహనాలు ఎదురవుతు న్నాయి.

నడవలేని అశక్తత.

వెంకటరాముడు అప్రయత్నంగానే అన్నా నా ఆలోచనల్ని తట్టి లేపేమాట అన్నాడు ''ఇంత చదువూ చదువుకొని అఫ్టాల్ క్లర్క్ మాటలు నమ్మి మోసపోయాం. ఏమీ ప్రపంచజ్ఞానం లేక మోస పోయే అమాయకులైన మన రైతుల పరిస్థితి ఎంత దారుణం''.

ఆ మాట నాలో ప్రకంపనాలు పుట్టించింది. చాలా సందర్భాల్లో నాన్న బ్యాంకుల చుట్టూ, ఎమ్.ఆర్.వో ఆఫీసు చుట్టూ, మండలాఫీసు చుట్టూ కాళ్ళరిగేలా తిరగడం, వేరుశనగపంట ఏ సంవత్సర మైనా మంచిపంట పండితే దారుణంగా రేట్లు పడి పోవడం, దళార్లు దాన్ని అవకాశంగా తీసుకొని దండుకోవడం ఇంకా చాలా కదిలాయి.

వెంకటరాముడు ఒక లారీని చెయ్యెత్తి ఆపాడు. లారీ ఎక్కాము. లారీ వెళ్తుంటే రోడ్డుపక్కనున్న ఇళ్ళ న్నిటినీ చీకటి కబళిస్తోంది – పల్లెని పట్టణం మింగే స్తున్నట్టుగా.

జ్ఞాపకాలు చుట్టుముడుతున్నాయి.

''నాకు, తమ్ముడికి, చెల్లెలికి సంగటిపెట్టి అమ్మ ఆకలితో పండుకొన్న జ్ఞాపకం.

చదువుకొనే పిల్లోలని బట్టలకోసం శెట్టిపల్లి పురు షోత్తాన్ని అప్పు అడిగిన జ్ఞాపకం.

నా చదువు, తమ్ముడి చదువు కోసం చెల్లి తొమ్మిదో తరగతిలో చదువు ఆపేసిన జ్ఞాపకం. మా ఇంటికి పరిస్థితులకు కాస్త కలిగున్న వారి పొలాల్లో కూలికి వెళ్ళి చెమటను నాటేసిన జ్ఞాపకం.

పదవ తరగతి ఫస్టుక్లాసులో పాసయ్యి, చదివే స్తోమత లేక రెండు సంవత్సరాలు నేనూ కూలికి వెళ్లిన జ్ఞాపకం.

తిరిగి రాయలసీమ రైసుమిల్లులో నైటు వాచ్ మెన్‌గా అవతారమెత్తి ఇంటరు ఫస్టుక్లాసులో పాస య్యిన జ్ఞాపకం.

పరిస్థితుల ప్రభావం వల్ల నాన్న ఆరోగ్యం దెబ్బ తినడంతో మళ్ళీ రెండేండ్లు పల్లెలో కూలికి అంకిత మైన జ్ఞాపకం.

అప్పులు పెరిగిపోతుంటే అనేక సందర్భాలలో నాన్న అవమానంతో తలదించుకున్న జ్ఞాపకం.

ముగ్గురికీ కలసి అరవై రూపాయల కూలితో కుటుంబం జరగడం కష్టం కావడంతో తమ్ముడూ చదువుకి విడాకులు ఇచ్చిన జ్ఞాపకం.

వేరుశనగపంట పండినా పండకపోయినా నాన్న ముఖంలో బాధమోసులెత్తిన జ్ఞాపకం. పండితే రేటుండదు పండకపోతే అభిమాన ముండదు.

నేను పేపరు బాయిగా అవతారమెత్తి డెబ్బయి ఆరుశాతం మార్కులతో డిగ్రీ విజయవంతంగా పూర్తి చేసిన జ్ఞాపకం.

యూనివర్సిటీలో చేరినప్పుడు అమ్మానాన్న కళ్ళల్లో మెరుపులు మెరిసి తమ కష్టాలు తీరతాయని ఆశలు మొలకలేసిన జ్ఞాపకం.

మా ఊరి నాగన్న అప్పుల బాధకు తట్టుకోలేక చేసుకున్న ఆత్మహత్యను పేపర్లో చదివి నేనూ కదిలి పోయిన జ్ఞాపకం.

కరువులకి తట్టుకోలేక ఈనబోతున్న మా ఆవుని అమ్ముకున్న జ్ఞాపకం.

గడ్డిలేక కాడి ఎద్దులు కబేలాకు అమ్మి భుజా నున్న టవలుతో నాన్న కళ్లల్లో నీళ్ళు తుడుసుకున్న జ్ఞాపకం. నేను మొదటిసారి సివిల్సు ప్రిలిమినరీ పరీక్ష రాయడానికి హైదరాబాదు వెళ్ళడానికి ఆ ఎద్దులు అమ్మిన డబ్బుల్లో నుండి మూడు వందలు నా చేతిలో పెట్టిన జ్ఞాపకం.''

క్యాలెండరులో సంవత్సరాలు మారినా ఇక్కడి జీవితాల్లో మార్పు రాకపోగా రోజురోజుకి దుర్భరం అవుతోంది.

యూనివర్సిటీ వచ్చింది. లారీ దిగగానే వెంక ట్రాముడన్నాడు.

''ఈ జిల్లాలో రైతు కుటుంబాల్లో పుట్టడమే మనం చేసిన పెద్ద తప్పు''.

నేను కళ్ళలో నీళ్ళు తుడుసుకోవడం చూసి ''రేయ్ రాజా! ఏంటిరా ఇది! చిన్న పిల్లాడిలాగా! ఈసారి కాకపోతే రేపటిసంవత్సరం. రాస్తావు. అంతేగాని ఇలా ఏడ్వడం ఏంటి చిన్న పిల్లాడి లాగా'' అంటూ నా భుజం మీద చేయివేశాడు.

''ఇంకా రాయడమేంటిరా? ఈ సంవత్సరంతో నాకు ఇరవై ఎనిమిది సంత్సరాలు దాటిపోతాయి. ఇదే చివరి అవకాశం. నేను కన్నకలలు కల్లలైన అవ కాశం. ఈ దేశంలో తొంభైయేళ్ళున్నా మంత్రిగా కూర్చోవచ్చు. నిరుద్యోగానికీ, ప్రతిభకీ ఈ వయోని బంధన ఏంటిరా! దుర్మార్గం కాకపోతే''

జేబులోంచి హాల్‌టికెట్టు బయటికి తీశాను. చివ రిసారిగా చూశాను. నా ఫోటో దాని ప్రక్కనే ''మా రక రాజశేఖర్'' అని ఇంగ్లీషులో నా పేరు. దాని కింద నా నెంబరు. నంబరు కింద పరీక్షాకేంద్రం చూడలేక ముక్కలుముక్కలుగా చించి విసిరేశాను. లైటువెలుగులో కొన్ని ముక్కలు గాలిలో ఎగురుతు న్నాయి – నాలో రగులుతున్న బాధలాగా.

మళ్ళీ వెంకటరాముడు అన్నాడు. ''అందరూ తమతమ కులాలకి, మతాలకి రిజర్వేషన్లు కావా లంటారు. ఏ ఒక్కరూ వెనుకబడిన ప్రాంతాలకు రిజర్వేషన్లని ఆలోచించరు''.

వెనుక నుండి చిన్న గాలి.

దూరంగా చంద్ర ఎదురు చూస్తున్నాడు. వెంకట రాముడి కోసం, బహుశా మా రాక కోసం దగ్గర కొచ్చి ''ఏరా వెళ్లలేదా? సరేలే బాధపడవద్దు'' గ్రూప్‌వన్ నోటిఫికేషను వచ్చింది. ఇందాక వార్తల్లో చెప్పారు. రేపు పేపర్లో నోటిఫికేషను వస్తుంది. మూడువందల యాభై పోస్టులట. నిజంగా పెద్ద నోటిఫికేషను''.

మళ్ళీ ఆశ పురుడుపోసుకుంది. ఎందుకంటే కేంద్ర సర్వీసు కమీషను నిర్వహించే సివిల్సులో ఇరవై ఎనిమిది సంవత్సరాలకే వయోనిబంధన. కానీ, రాష్ట్ర సర్వీసు కమీషన్ నిర్వహించే గ్రూప్ వ న్‌లో ముప్ఫైయైదు సంవత్సరాల వరకూ రాయవ చ్చు.

ఆశ

ఆశ తిరిగి క్షణాల్లో వటవృక్షమై నా మనసంతా ఆక్రమించుకుంది.

★

